TGTEL/26/A0372

# మన మహతి న్యూస్

## తెలుగు దిన పత్రిక

ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | ఆదివారం జూలై 19, 2026 | సంపుటి : 01 సంచిక : 165 | పేజీలు 5 వెల-2/- MANAMAHATINEWS.COM

# 'స్కైరూట్' హీరోలు..

## రూమ్‌మేట్స్ నుంచి రాకెట్ రూపకల్పన వరకు!



- స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా ప్రయోగం.
- ఇది భారతదేశపు తొలి స్వదేశీ ఆర్బిటల్ క్లాస్ ప్రైవేట్ రాకెట్.
- వ్యవస్థాపకులు ఇద్దరూ ఇస్రోలో శాస్త్రవేత్తలుగా పనిచేశారు.
- ఐఐటీ రోజులలో మొదలైన పరిచయం, ఇస్రోలో రూమ్‌మేట్స్‌గా మారడం వారి వ్యాపార ప్రయాణానికి బాట వేసింది.
- చిన్న, మధ్యస్థాయి ఉపగ్రహాల కోసం రాకెట్ల మార్కెట్‌లో అవకాశాన్ని గుర్తించి సంస్థను స్థాపించారు.

2లో



# ఇది మొదటి అడుగు మాత్రమే

## స్కైరూట్ ఫౌండర్స్‌తో ప్రధాని మోదీ



- విక్రమ్-1 ప్రయోగం విజయవంతం
- స్కైరూట్ ఫౌండర్స్‌ను అభినందించిన ప్రధాని మోదీ.
- "ఇది మొదటి అడుగు మాత్రమే" అని మోదీ వ్యాఖ్య.
- అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబనకు ప్రశంసలు.
- స్కైరూట్ బృందంలో ఎక్కువమంది యువ ఇంజినీర్లు.

భారత అంతరిక్షరంగంలో ప్రైవేటు రంగానికి ఘనమైన బాటలు పడ్డాయి. ప్రముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్ ' పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1 విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. దీంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. ఈ ప్రయోగం అనంతరం ప్రధాని నరేంద్రమోదీ కి కాల్ చేసి స్కైరూట్ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ చందన, నాగ్ భరత్ మాట్లాడారు.

"అనుకున్న సమయానికంటే ముందుగానే మీ లక్ష్యాలను సాధించారు. ఈ ప్రయోగాన్ని నేను వీక్షించాను. ఇందులో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ మిషన్ మొదటి అడుగుమాత్రమే. దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలి" అని మోదీ వారిని ప్రశంసించారు. అంతరిక్ష రంగంలో స్వావలంబన సాధించగలమని ప్రపంచానికి చూపించారని కొనియాడారు. ఈ దేశ ఆకాంక్షలను మోసుకెళ్లడమే కాకుండా యువత కలలకు కొత్త ఆశలు తొడిగారని మెచ్చుకున్నారు. అలాగే తనను కలిసేందుకు స్కైరూట్ బృందాన్ని ఆహ్వానించారు.

2లో

## ఎల్‌నినో ప్రభావాన్ని అంచనా వేసేందుకు నిపుణుల కమిటీ

హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావాన్ని అంచనా వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అధ్యక్షుడిగా, అధికారులు, శాస్త్రవేత్తలు, నిపుణులు సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. రాష్ట్రస్థాయి ప్రణాళిక, తీసుకోవాల్సిన చర్యలను ఈ కమిటీ సిఫార్సు చేయనుంది. మరోవైపు ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

### ఐదుగురు మృతి ఘటనపై

## దిగ్భ్రాంతి

- డిప్యూటీ సిఎం పవన్, హోంమంత్రి అనిత సంతాపం



2లో

పోలవరం జిల్లా ఏటపాక మండల పరిధిలోని గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి చెందిన ఘటన దిగ్భ్రాంతి కలిగించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పోలవరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నట్లు చెప్పారు.

# ప్రజాకవికి అపూర్వ గౌరవం ఇచ్చాము

## అందెశ్రీ కుటుంబానికి వాగ్దానాలన్నీ నెరవేర్చాం

'అందెశ్రీ స్మృతి వనం' శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక సారథి, ప్రజాకవి డాక్టర్ అందెశ్రీకి తమ ప్రభుత్వం అపూర్వ గౌరవం ఇచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో అందెశ్రీ అంతిమ సంస్కారాలు జరిగిన ప్రదేశంలో 'అందెశ్రీ స్మృతి వనం' ఏర్పాటుకు, అలాగే ఆయన విగ్రహ ప్రతిష్ఠాపనకు జయంతి రోజైన శుక్రవారం నాడు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి ఉప ముఖ్యమంత్రి భూమి పూజ చేసి, పునాది రాయి వేశారు.

2లో..

## కృష్ణపట్నం పోర్టులో ప్రమాదం.. సముద్రంలో కలిసిన క్రూడాయిల్



కృష్ణపట్నం: నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టులో ప్రమాదం సంభవించింది. పోర్టు రెండో నంబర్ బెర్త్ వద్ద పైపులైన్ పగలడంతో పెద్ద మొత్తంలో క్రూడాయిల్ సముద్రంలో కలిసిపోయింది. నిర్వహణ లోపమే ఈ ఘటనకు కారణమని ఆరోపణలు వస్తున్నాయి. క్రూడాయిల్ వృథాలో కాంట్రాక్టర్లు, పోర్టు అధికారులు, సిబ్బంది పాత్రపై యాజమాన్యం విచారణ చేపట్టింది.

## భర్తను హత్య చేసిన భార్య.. ఆరుగురు నిందితుల అరెస్టు




2లో

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ



కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి

2లో..

## పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ పరామర్శ

త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిసిన ఆయన.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి సర్జరీ చేసింది.


## అథ్లెట్ ప్రవల్లికకు సిఎం రేవంత్ అభినందనలు



చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ -2026లో మహిళల 4-400 మీటర్ల రిలే పోటీలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆధ్వర్యంలోని గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని నరిమళ్ల ప్రవల్లికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి ప్రవల్లిక ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభినందించిన సిఎం క్రీడలకు తెలంగాణ కేంద్రంగా మారాలని అభినందించారు. ప్రవల్లికకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## సంగారెడ్డిలో దారుణం..

18 రోజుల పసికందును నేలకేసి కొట్టి చంపిన తండ్రి



జోగిపేట టౌన్: సంగారెడ్డి జిల్లా జోగిపేటలో దారుణం చోటు చేసుకుంది. 18 రోజుల పసికందును నేలకేసి కొట్టి.. కన్నతండ్రే హతమార్చాడు. సీఐ అనిల్ కుమార్ వెల్లడించిన వివరాల మేరకు..

2లో

# సంపాదకీయం

## దళితబహుజన వాదానికి కొత్త పిలుపు







అడకత్తెరలో పోకచెక్క అనే సామెత ఉంది. ముందు నుయ్యి, వెనుక గొయ్యి అనే సామెత కూడా ఉంది. ప్రస్తుతం ఈ సామెతలు అన్వయించే క్లిష్ట సందర్భంలో 'హిందూ దళిత బహుజనులు' ఉన్నారు.

దళిత బహుజన పౌరులందరూ నాస్తికులు కారు. వారికి మతం గురించిన ఆసక్తులు ఉంటాయి. వారు తమ మతాసక్తులు దెబ్బతినకుండా కాపాడుకోవడంలో ఏ తప్పూ లేదు. హిందూ దళిత బహుజనుల ఆసక్తులు రెండు: ఒకటి మతం, రెండు సామాజిక న్యాయం. కానీ హిందూ దళిత బహుజనులు ఈ రెండు ఆసక్తులనూ నెరవేర్చని రెండు భిన్న భావజాలాల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. వాటిల్లో ఒకటి ఆరెస్సెస్ హిందూ భావజాలం, రెండవది లౌకికవాద నాస్తిక దృక్పథం. ఈ రెండు దృక్పథాలు వారిలోని ఒక ఆసక్తిని నెరవేరిస్తే, ఇంకొక ఆసక్తిని నెరవేర్చే పరిస్థితి లేదు.

హింసను ఎదుర్కోవడం పట్ల గాంధీజీ జైనమత దృక్పథాన్ని ఆరెస్సెస్ భావజాలం నిరసిస్తుంది. మతం కంటే దేశానికే అగ్రతాంబూలం ఇస్తుంది. జైన, బౌద్ధ మతాలను భారతీయ మతాలుగా గుర్తిస్తోంది. మెజారిటీ ప్రజలైన హిందూ జాతి సాంస్కృతిక వైభవాన్ని గుర్తించి, వ్యక్తి సచ్ఛీలతకు, దేశభక్తికి పునాదులు వేస్తోంది. కానీ దళిత బహుజనుల సామాజిక న్యాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. వర్ణధర్మాలను(వృత్తి ధర్మాలను) భగవద్గీత గుణకర్మలతో ముడిపెట్టింది కానీ, పుట్టుకతో (నవతీవసఙ్ఖుతీఎ ౯ాతీశీటవంంఱశీఅ) ముడిపెట్టలేదు. ఈ విధంగా భగవద్గీతలో చెప్పినదే ఆధునిక చింతన కూడా! కానీ మధ్యయుగాలలో అమలైన 'నవతీవసఙ్ఖుతీఎ౯ాతీశీటవంంఱశీఅ'ను మాత్రమే ఆరెస్సెస్ స్థిరీకరించే ప్రయత్నం చేస్తోంది. ఇది హిందూ దళిత బహుజనుల సామాజిక న్యాయానికి పెనుప్రమాదం! కాబట్టి హిందూ దళిత బహుజనులు ఆరెస్సెస్ వైపు మొగ్గుచూపడం ఆరోగ్యకరం కాదు. ఆరెస్సెస్‌లోగానీ, దాని అనుబంధ రాజకీయపార్టీ బీజేపీలోగానీ వారిమత, సాంస్కృతిక ఆసక్తులు నెరవేరుతాయి కానీ, సామాజిక న్యాయం సమకూరదు.

ఇక రెండవది, లౌకికవాద నాస్తిక దృక్పథం. నాస్తికత్వం భౌతిక జీవితానికి తప్ప, అలౌకిక అన్వేషణకు ప్రాధాన్యం ఇవ్వదు, ఖండిస్తుంది కూడా. సెక్యులరిస్టులు కానీ, మార్క్సిస్టులు కానీ నాస్తికులైనవారు మతాన్ని అధ్యయనం చేయరు. అవసరం కూడా లేదు అనుకుంటారు. కానీ వీరికి మతం పట్ల గుడ్డి నిరాకరణ మాత్రం ఉంటుంది. ఇక్కడ ఒక ప్రమాదం పొంచివుంది. మతం గురించి తెలియనివాళ్లకు ఆ జాతి సంస్కృతి తెలియదు. సంస్కృతి తెలియనివాళ్లకు ఆ జాతి భావావేశాలూ అర్థం కావు. ఇటువంటి నాస్తిక మేధావుల మధ్య, వారి సంస్థలలో దళిత బహుజనుల మతభావాలు సహజంగానే దెబ్బతింటాయి. ప్రశ్నకు గురవుతాయి. దళిత బహుజనులకు తమ మతం పట్ల, తమ సంస్కృతి పట్ల ఉన్న భావావేశాలు, ఈస్థటిక్స్ నాస్తిక సమూహాల మధ్య సంతృప్తి పొందవు.

ఈ విధంగా తమ సామాజిక న్యాయాన్ని విస్మరించిన ఆరెస్సెస్, బీజేపీ ఒకవైపు; తమ జాతినీ, సాంస్కృతిక అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసే నాస్తికవాదం మరొకవైపు-- ఈ రెండూ హిందూ దళిత బహుజనులకు ఆమోదయోగ్యం కాలేవు. ఈ క్రమంలోనే దళిత బహుజనులు ఈ రెండు భిన్నధృవాలకు మధ్యస్థంగా, స్వతంత్రంగా ఆలోచించక తప్పదు. ఆరెస్సెస్ శక్తులకు, నాస్తికవాద శక్తులకు దూరంగా తమ హిందూ దళిత బహుజన అస్తిత్వాన్ని ఆవిష్కరించుకోవాలి. దళిత బహుజనుల్లో కొందరికి హిందూ పదాన్ని జోడించడమే ఇష్టం ఉండదు. అందుకు క్రిస్టియన్, ఇస్లాం మేధావులకు, లౌకికవాదులు, మార్క్సిస్టులకు ఎవరి కారణాలు వారికి ఉన్నాయి. క్రిస్టియన్ మేధావులకు హిందూ దళితుల పట్ల అసహనం ఉండవచ్చు. హిందూ మతం వారిని గుళ్లకు దూరం చేసినా, ఊరి బయటకు తరిమినా ఇంకా ఆ మతాన్నే పట్టుకుని వేలాడుతున్నారని కోపం ఉండవచ్చు. ఈ కోపం సకారణమే. కాబట్టి మనం అర్థం చేసుకోనూవచ్చు. దళితులు, దళిత క్రిస్టియన్లు హిందూమతం పట్ల రియాక్షనరీస్‌గా మారడం సహజమే. అందుకు మనుధర్మ శాస్త్రమే కారణం. దీనిని హిందూ సమాజం బహిష్కరించవలసిందే!

ముస్లింల రియాక్షన్‌కు సామాజిక దౌష్ట్యాలు కారణం కాదు. హిందూమతం పట్ల వారి రియాక్షన్‌కు వారు నమ్మిన ఇస్లాం మతగ్రంథాలే కారణం. ముస్లింలు-- హిందూమతంలోని అస్పృశ్యతను ప్రశ్నిస్తారు. వర్ణధర్మాన్ని ప్రశ్నిస్తారు. మనుధర్మ శాస్త్రాన్ని దండిస్తారు. బ్రాహ్మణాధిక్యతను ఎత్తిచూపుతారు. ఈ విమర్శలన్నిటినీ హిందూ దళిత బహుజనులు ఆహ్వానిస్తారు, ఆమోదిస్తారు కూడా! మైనారిటీ మతాలతో హిందూ దళిత బహుజనులు సహజీవనాన్ని కోరుకుంటారు. సహజీవనానికి అవసరమైన సంస్కరణలను ఆ మతాల నుంచి కూడా ఆశిస్తారు. ముస్లింలు యుద్ధ జిహాద్‌ను ఖండించాలని, ప్రపంచాన్ని ఇస్లాం రాజ్యంగా మార్చాలనే అప్రజాస్వామికతను ప్రశ్నించాలని, అన్యమతాల పట్ల కాఫిర్లు అనే శత్రుభావాన్ని విడనాడాలని.. హిందూ దళిత బహుజనులు కోరుకుంటారు.

వర్తమానంలో హిందూ, ఇస్లాం శక్తులకు ఎవరి రాజకీయాలు వారికి ఉన్నాయి. ఎవరి వ్యూహాలు వారికి ఉన్నాయి. 2030 సంవత్సరం అంటూ ఒకరు, 2047వ సంవత్సరం అంటూ ఒకరు తమ వ్యూహాలు అమలు చేయబోయే కాల నిర్ణయాలు కూడా జరిగిపోతున్నాయి. ఈ ప్రమాదానికి విరుగుడు ఆరెస్సెస్, బీజేపీలు కాదు. నాస్తిక మార్క్సిస్టులూ కాదు. హిందూ, అబ్రహామిక్ మతాల మధ్య అపోహలు లేని సహజీవనమే ఇప్పుడు కావలసినది. ఇందుకు అనుగుణంగా ఎవరి మతాలను వారు సంస్కరించుకోవలె, శుభ్రపరచుకోవలె, ప్రజాస్వామ్యీకరించుకోవలె!

హిందూ దళిత బహుజనవాదం మధ్యయుగాల మతవ్యవస్థను నిరాకరిస్తుంది. తమ మతాన్ని ప్రజాస్వామ్యీకరించుకునేందుకు పోరాడుతోంది. బ్రాహ్మణాధిపత్యాన్ని అంగీకరించదు. అన్ని చారిత్రక కాలాల్లోనూ మతగ్రంథాలను కాపాడుతూ వచ్చిన బ్రాహ్మణుల చారిత్రక పాత్రను గుర్తిస్తుంది. దేశమా? మతమా? అంటే దేశానికే మొదటి ప్రాధాన్యం ఇస్తుంది! మతాల పండుగల్లోగానీ, గుళ్లల్లో, దర్గాల్లో, చర్చిల్లోగానీ.. అన్ని మతాల ప్రజలూ పాల్గొనే ఒక మహత్తర సన్నివేశాన్ని కలగంటుంది. తమకంటే ఎక్కువగా అణగదొక్కబడిన పీడితుల ప్రయోజనాలకే పెద్దపీట వేయవలె. ఆ తరువాతే తమ ప్రయోజనాలను గుర్తించుకోవలె. పీడనను నిర్వచించేది కులమూ కావచ్చు, కొన్ని సందర్భాల్లో ప్రాంతమూ కావచ్చు. పట్టణమూ, పల్లెటూళ్ల మధ్యగల అవకాశ వ్యత్యాసాలూ కావచ్చు. ఈ విశాల దృక్పథాన్ని కూడా హిందూ దళిత బహుజనవాదం ప్రోత్సహిస్తోంది. జాతీయ సంస్కృతిని పాటించడానికి ఏ మత సంస్కృతులూ, ఆచారాలూ అడ్డుపడే సందర్భాలు రాకూడదని కోరుకుంటోంది. పల్లె ప్రాంతాల్లోని మాదిగ, మాలల ఆధ్యాత్మిక హక్కుల పోరాటాన్ని మొదటి కార్యాచరణగా స్వీకరిస్తోంది.

హిందూ దళిత బహుజనవాదం ఏకశిలా సదృశమైన మతాన్ని కోరుకోదు. వేదాలు, ఉపనిషత్తులు, శైవం, వైష్ణవం వంటి వాటిని కోరుకుంటుంది. ముక్కోటి దేవతలు, ఎల్లమ్మ, ముత్యాలమ్మ వంటి గ్రామదేవతలు, ఆదివాసీల దేవుళ్లు అన్నిటినీ హిందూ బహుళత్వంలో భాగంగా స్వీకరిస్తుంది. యోగులు, సాధువులు.. సూఫీలు, క్రిస్టియన్ సన్యాసులు.. అందరికీ పూజ్యభావంతో మోకరిల్లుతుంది. భారతీయ కులసమాజాన్ని

# భర్తను హత్య చేసిన భార్య.. ఆరుగురు నిందితుల అరెస్టు

మొదటిపేజీ తరువాయి

కుప్పం పట్టణం: చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై నాలుగు రోజుల క్రితం ఓ మహిళ భర్తను చంపిన కేసులో పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే నెపంతోనే ప్రియుడు గంగాధరతో కలిసి భర్త రమేష్‌ను హాసిని చంపినట్లు డీఎస్పీ పార్థసారథి వెల్లడించారు. ఈ హత్యలో గంగాధరకు సహకరించిన మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ హత్య కేసులో మరో ఇద్దరి పాత్ర ఉన్నట్లు అనుమానం రావడంతో వారి కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న పవన్ అనే నిందితుడిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు పోలీసులు చెప్పారు.

వివరాల్లోకి వెళితే.. తమిళనాడులోని సూలగిరి పరిధి దేవసానపల్లెకు చెందిన రమేష్ హోసూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అతనికి కుప్పం నియోజకవర్గం బోయనపల్లెకు చెందిన హాసినితో రెండేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న మౌలికశ్రీ సంతానం. ఈనెల 13న కుటుంబమంతా బోయనపల్లెకి వచ్చి, ఆ మరునాడు సంగనపల్లెలోని మల్లప్పకొండ మల్లేశ్వరస్వామి ఆలయానికని బైక్‌పై బయల్దేరారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో హాసిని తల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆలయ సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా.. మొదట భర్త, పాపతో హాసిని బైక్‌పైన ఆలయానికి వెళ్లినట్లు కనిపించింది. తిరుగు ప్రయాణంలో భర్త తెచ్చిన బైక్‌పైనే మరో ఇద్దరు యువకులతో కలిసి తిరిగి వెళ్తున్నట్లు గుర్తించారు. వాటి ఆధారంగా అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా మల్లప్పకొండ ఘాట్ రోడ్డు సమీపంలో రమేష్ మృతదేహం లభించింది.

# పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఏపీ అత్యంత సురక్షిత

**-పర్యాటక మంత్రి కందుల దుర్గేష్**

**"ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ముఖ్య అతిథిగా మంత్రి**

**సింగిల్ విండో విధానం ద్వారా శరవేగంగా పర్యాటక అనుమతులు**

అమరావతి, జులై 18 : భారతదేశ దేశీయ పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత కీలకమైన భూమిక పోషిస్తోందని, పర్యాటక రంగాన్ని ఒక వ్యూహాత్మక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం న్యూఢిల్లీలోని చాణక్యపురి 'హోటల్ జింజర్' వేదికగా అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "స్వదేశీ పర్యటన్ ? సశక్త్ భారత్" అనే ప్రధాన ఇతివృత్తంతో.. ఆంధ్రప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై ప్రత్యేక ఫోకస్‌తో జరిగిన సదస్సు లో మంత్రి దుర్గేష్ కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పర్యాటకరంగ సేవల్లో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎడిటిఓఐ సంస్థకు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,400 మందికి పైగా సభ్యులతో విస్తరించిన ఈ జాతీయ నెట్‌వర్క్, భారతీయ పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అరకు లోయ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ఏడు ప్రధాన పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికం, తీరప్రాంతం (కోస్టల్), పర్యావరణం (ఎకో), బౌద్ధ వారసత్వం, గ్రామీణ సంస్కృతి కలగలిసిన అరుదైన పర్యాటక అనుభూతి ఆంధ్రప్రదేశ్ సొంతమని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి దివ్యక్షేత్రాల నుండి అరకు లోయ అందాలు, గండికోట గ్రాండ్ కాన్యన్, బెలుం గుహల వరకు ఎన్నో అద్భుతాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు.పర్యాటక రంగం కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలు, తీరప్రాంతాలు, గిరిజన ప్రాంతాల వరకు విస్తరించి మహిళలకు, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, స్థానిక వంటకాలు మరియు చేతివృత్తులకు ప్రాచుర్యం తెస్తుందని మంత్రి దుర్గేష్ నొక్కి చెప్పారు. అమరావతి, నాగార్జునకొండ, తొట్లకొండ, బొజ్జన్నకొండ వంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలతో పాటు విజయవాడ, శ్రీకాళహస్తి క్షేత్రాలను, కోనసీమ గ్రామీణ పర్యాటకాన్ని, మారేడుమిల్లి, కోరింగ వంటి పర్యావరణ పర్యాటక కేంద్రాల ప్రాధాన్యతను మంత్రి వివరించారు.ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కలంకారీ కళలు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, ఉప్పాడ-ధర్మవరం చేనేత వస్త్రాలు మరియు అరకు కాఫీ వంటి విశిష్ట ఉత్పత్తులను టూరిజం ప్యాకేజీలలో భాగం చేయాలని కోరారు. పర్యాటకులు ఏపీని కేవలం చూడటమే కాదు... ఇక్కడి సంస్కృతిని అనుభవించేలా చేయాలన్నారు.పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసేలా, ఎక్కువ ఖర్చు పెట్టేలా సరికొత్త హోమ్‌స్టేలు, ఎకో-లాడ్జ్‌లు, కారవాన్ టూరిజం మరియు అడ్వెంచర్ టూరిజం వంటి మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎడిటిఓఐ జాతీయ అధ్యక్షుడు వేద్ ఖన్నా, సంస్థ ముఖ్య ప్రతినిధులు, దేశంలోని వివిధ రాష్ట్రాల చాప్టర్ల ఛైర్మన్లు, పర్యాటక, హోటల్ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

**తెలంగాణలో లూటీ జరుగుతోంది**

**మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది**

**చాయ్ పే చర్చాను మరచిన రాహుల్**

**బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు**

హైదరాబాద్,జూలై18: ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యవ

# 'స్కైరూట్' హీరోలు..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అంతరిక్షంలోకి ఉపగ్రహాలను తీసుకెళ్లేందుకు వీలుగా రాకెట్‌ను రూపొందించి చరిత్ర సృష్టించింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1'ను నింగిలోకి పంపించింది. అయితే, ఈ ఘనత సాధించడంలో ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు, సంస్థ వ్యవస్థాపకులైన పవన్ కుమార్ చందన, నాగ భరత్‌లు కీలక పాత్ర పోషించారు. 'స్కైరూట్' పేరుతో అంకుర సంస్థతో తమ ప్రయాణాన్ని మొదలుపెట్టి అనతికాలంలోనే రూ.వేల కోట్ల విలువైన యూనికార్న్ స్థాయికి తీసుకెళ్లారు. తాజాగా రాకెట్ ప్రయోగం విజయవంతంతో అంతరిక్ష ప్రయోగాల్లో తమదైన ముద్ర వేసుకున్నారు.

**రూమ్‌మేట్స్‌గా మొదలై..**

హైదరాబాద్‌లో జన్మించిన పవన్ కుమార్ చందన స్థానికంగానే విద్యాభ్యాసం పూర్తి చేశారు. 2007లో ఐఐటీ ఖరగ్‌పుర్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్) కోర్సులో చేరారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఇస్రోలో శాస్త్రవేత్తగా ఉద్యోగం సంపాదించారు. అయితే, తనకు చిన్నప్పటి నుంచి సొంతంగా ఒక వ్యాపార సంస్థ స్థాపించాలనే ఆశ ఉండేదట. ఐఐటీలో చేరాక ఆ ఆశ ఇంకా బలపడిందని పవన్ ఓ సందర్భంగా పేర్కొన్నారు. తనలాంటి ఆలోచనా ధోరణే ఉన్న వ్యక్తి (నాగ భరత్ డాక) ఇస్రోలో సహ శాస్త్రవేత్తగా 'రూమ్ మేట్'గా రావటంతో సొంతంగా వ్యాపారవేత్తగా ఎదగాలనే తన కలను నిజం చేసుకొనేందుకు ఓ అవకాశం కలిగిందని చెప్పారు.

**ఇది మొదటి అడుగు మాత్రమే: స్కైరూట్ ఫౌండర్స్‌తో ప్రధాని మోదీ**

"త్రివేంద్రంలోని ఇస్రో క్యాంపస్ ఎంతో బాగుంటుంది. మంచి ఉద్యోగం, మంచి జీతం, ఇక్కడే రిటైరై పోవచ్చు అని తొలినాళ్లలో అనిపించేది. కానీ, వ్యాపారవేత్త కావాలని అంతర్లీనంగా ఉన్న ఆలోచన నెమ్మదిగా బయటకు వచ్చింది. అందుకు నాకు తెలిసిన అంతరిక్ష శాస్త్రమే అవకాశం కల్పించింది" అని పవన్ కుమార్ పేర్కొన్నారు. మరోవైపు, స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, సీఓఓ నాగ భరత్ డాక ఐఐటీ మద్రాస్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్) చేసి ఇస్రోలో శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. ఇద్దరూ కొన్నేళ్లపాటు ఇస్రోలో విధులు నిర్వహించారు."ఇస్రో ప్రధానంగా పెద్ద ఉపగ్రహాలు ప్రయోగించడానికి అవసరమైన భారీ రాకెట్లు ఉత్పత్తి చేస్తుంది. చిన్న, మధ్యస్థాయి ఉపగ్రహాలకు అనువైన రాకెట్లను ఉత్పత్తి చేయడం తక్కువ. ఇక్కడే వ్యాపారావకాశం ఉందని గమనించాం" అని పవన్, భరత్‌లు తెలిపారు. ఈ క్రమంలో ముఖేష్ బన్సల్ (మింత్రా వ్యవస్థాపకుడు)ను కలిశామని, ఆయన వెంటనే మూలధనాన్ని సమకూర్చడంతో ఇస్రో ఉద్యోగాన్ని వదిలేసి ఇద్దరం కలిసి స్కైరూట్ ఏరోస్పేస్‌ను ఏర్పాటు చేశామన్నారు.

# ఇది మొదటి అడుగు మాత్రమే

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ప్రధానికి కృతజ్ఞతలు చెప్పిన పవన్ కుమార్ చందన.. ఈ రాకెట్‌ను పూర్తిగా దేశీయంగా డిజైన్ చేశామని వెల్లడించారు. తమ బృందంలో ఎక్కువమంది యువతే అని.. వారి సగటు వయసు 28 ఏళ్లని తెలియజేశారు.

ఈ లాంచ్ లో భాగంగా మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసిన పోస్ట్ కార్డును అంతరిక్షంలోకి పంపించారు. దాని గురించి మోదీ వద్ద పవన్ కుమార్ ప్రస్తావించారు. "మీ కార్డు కక్ష్యలోకి విజయవంతంగా చేరింది. వందేమాతరం కక్ష్యలోకి వెళ్లింది" అని చెప్పారు.

రోదసిలో స్కైరూట్ చరిత్ర.. 'విక్రమ్-1' విజయవంతం

ఆ కార్డుపై వందేమాతరం రాయడానికి గల కారణాలను ఈ సందర్భంగా మోదీ (ౡవీ వీశీఎఱ) వివరించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో దేశభక్తిని రగిల్చిన ఈ గేయం 150 వసంతాలు పూర్తి చేసుకుంది. కార్డుపై ఆ గేయం పేరు రాయడానికి అది ఒక కారణం కాగా.. "అది ఎల్లప్పుడూ యువతకు స్ఫూర్తినిచ్చింది. మీరు ఆ స్ఫూర్తితోనే ముందుకుసాగుతున్నారు. ఇలాగే ఉన్నత శిఖరాలు అందుకునేలా ముందుకు ప్రయాణించండి. నేను మీతో ఉంటాను" అని పేర్కొన్నారు.

# సంగారెడ్డిలో దారుణం..

మొదటిపేజీ తరువాయి

జోగిపేట పట్టణానికి చెందిన కృష్ణ, గౌరమ్మ దంపతులు.. పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నారు. గత కొన్ని రోజులుగా వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇవాళ ఉదయం కూడా తన భార్యతో గొడవపడిన కృష్ణ.. పాలు తాగుతున్న బిడ్డను లాక్కొని.. చిన్నారి చెంపలపై కొట్టాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించింది. కోపోద్రిక్తుడైన కృష్ణ.. చేతిలో ఉన్న పసికందును నేలకేసి కొట్టాడు. గౌరమ్మ గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న పసికందును జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# ఐదుగురు మృతి ఘటనపై దిగ్భ్రాంతి

మొదటిపేజీ తరువాయి

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు దిశానిర్దేశర చేశామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. గోదావరి నదిలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతిచెందిన ఐదుగురి కుటుంబాలకు హోంమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయ చర్యలు అందేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆకాంక్షించారు.

# ప్రజాకవికి అపూర్వ గౌరవం ఇచ్చాము

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... సాధారణంగా నాయకులు లేదా ప్రభుత్వాలు ఒక కార్యక్రమం చేసి ఆ తర్వాత వదిలేస్తుంటాయని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అలా కాదని, ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటుందని చాటిచెప్పారు. అందెశ్రీ దివంగతులైన వేళ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆయన పాడె మోసి ఒక కవికి ఇవ్వాల్సిన అపూర్వమైన నివాళిని అర్పించి, తమకున్న గౌరవాన్ని చాటారని గుర్తు చేశారు. ఒక నిరుపేద దళిత కుటుంబంలో పెరిగి, రాష్ట్రం కోసం తపించిన ప్రజా గాయకుడికి ఈ ప్రభుత్వం సముచిత మర్యాదను అందించిందన్నారు. ఆనాడు అందెశ్రీ అంత్యక్రియల సమయంలో ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఏ ఐదు వాగ్దానాలనైతే ఇచ్చిందో, వాటిని మరచిపోకుండా, నేడు స్మృతివనానికి భూమి పూజ చేసే సమయానికే వాటన్నింటినీ నెరవేర్చిన ప్రజా ప్రభుత్వంగా నిలిచామన్నారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇచ్చిన మాట ప్రకారం ఆయన కుమారుడు దత్తుకు బి.జె.ఆర్. డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడిగా (లెక్చరర్) ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించామని తెలిపారు. అలాగే అందెశ్రీ రచించిన ప్రసిద్ధ కవితా సంకలనం 'నిప్పుల వాగు' 20 వేల కాపీలను ప్రభుత్వ పరంగా ముద్రించి పంపిణీ చేసేందుకు విద్యాశాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, ఆ పనులను పురోగతిలో పెట్టామన్నారు. ఆయన అంతిమ సంస్కారాలు జరిగిన ప్రదేశాన్ని స్మృతి వనంగా మారుస్తామని చెప్పిన విధంగానే నేడు ముఖ్యమంత్రి తో కలిసి భూమి పూజ నిర్వహించడంతో పాటు, అందెశ్రీకి పద్మశ్రీ అవార్డు ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారికంగా సిఫార్సు కూడా చేయడం జరిగిందని వివరించారు. నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రతి ఒక్కరినీ కదిలించిన అందెశ్రీ కలం నుంచి జాలువారిన 'జయ జయహే తెలంగాణ' పాటను అధికారిక రాష్ట్ర గీతంగా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ఏ కార్యక్రమం జరిగినా ఈ పాటను వినేలా మరియు వినిపించేలా ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తున్నదని వివరించారు.

# ఐఐటీ హైదరాబాద్ 15వ స్నాతకోత్సవం ఘనంగా









## రికార్డు స్థాయిలో 1,398 మంది విద్యార్థులకు పట్టాలు -- నవోన్నత ఆవిష్కరణలతో దేశ నిర్మాణమే లక్ష్యమని పిలుపు

**హైదరాబాద్, జూలై 18 (మన మహతి న్యూస్):**

భారతీయ సాంకేతిక విద్యాసంస్థ హైదరాబాద్ (ఐఐటీ హైదరాబాద్ ) తన 15వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సంస్థ చరిత్రలోనే అత్యధికంగా 1,398 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసి కొత్త రికార్డు సృష్టించింది. కార్యక్రమానికి ప్రముఖ భరతనాట్య కళాకారిణి, పద్మవిభూషణ్ డా. పద్మ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులకుస్ఫూర్తిదాయక సందేశాన్ని అందించారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్‌పర్సన్ డా. బి.వి.ఆర్. మోహన్ రెడ్డి అధ్యక్షత వహించగా, డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి వార్షిక నివేదికను సమర్పించారు.ఈ ఏడాది మొత్తం 489 మంది బీటెక్, 528 మంది ఎంటెక్, 191 మంది పీహెచ్‌డీ, 111 మంది ఎంఎస్సీ, 40 మంది ఎండిజైన్, 18 మంది బీడిజైన్, 11 మంది ఎంఏ, 5 మంది ఎంఎస్, 4 మంది డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్ సైన్స్ విద్యార్థులు పట్టాలు అందుకున్నారు.

విద్యా ప్రతిభకు పురస్కారాలుస్నాతకోత్సవంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 5 స్వర్ణ పతకాలు, 44 రజత పతకాలు ప్రదానం చేశారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విద్యార్థి బొంతు మణి హేమంత్ రెడ్డి భారత రాష్ట్రపతి స్వర్ణ పతకాన్ని అందుకున్నారు. ఇతర విభాగాల్లోనూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇన్‌స్టిట్యూట్ గోల్డ్ మెడల్స్ అందజేశారు.కొత్త విద్యా మైలురాళ్లుఈ స్నాతకోత్సవంలో ఇచ్చిన డిజైన్ ఉ టెక్నాలజీ బీటెక్ తొలి బ్యాచ్‌తో పాటు ××ు--డీకిం జాయింట్ డాక్టరల్ ప్రోగ్రాము తొలి బ్యాచ్ విద్యార్థులు పట్టభద్రులయ్యారు. అలాగే క్రిటికల్ మినరల్స్, డిఫెన్స్ టెక్నాలజీ, ఫోటోనిక్స్, ఇండస్ట్రియల్ మెటలర్జీ, ×ూ× ఆధారిత కెమికల్ ఇంజినీరింగ్,కంప్యూటేషనల్ కెమికల్ ఇంజినీరింగ్ తదితర కొత్త విద్యా కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది.సంస్కృత నినాదం ఆవిష్కరణఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ తన అధికారిక సంస్కృత నినాదమైన ఇన్నోవాషన్ ఫర్ నేషనల్ బిల్డింగ్ (నవోన్మేషేణ దేశ నిర్మాణమ్)ను ఆవిష్కరించింది. దీని అర్థం "నవోన్నత ఆవిష్కరణల ద్వారా దేశ నిర్మాణం" అని డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి తెలిపారు.

### పద్మ సుబ్రహ్మణ్యం సందేశం

పట్టభద్రులను ఉద్దేశించి డా. పద్మ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, శాస్త్రీయ నైపుణ్యాన్ని భారతీయ జ్ఞాన సంపదతో సమన్వయం చేసి మానవాళి శ్రేయస్సుకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన శాస్త్రం, కళలు భారతదేశానికి రెండు కళ్ల వంటివని ఆమె పేర్కొన్నారు.

### డైరెక్టర్ బి.ఎస్. మూర్తి

ఐఐటీ హైదరాబాద్ గత ఏడాదిలో ×ూ ప్రపంచ ర్యాంకింగ్స్-2027లో 588వ స్థానం, ఇంజినీరింగ్ ఉ టెక్నాలజీలో ప్రపంచ టాప్-400లో స్థానం, స్టాన్‌ఫోర్డ్--ఎల్సేవియర్ టాప్ 2% శాస్త్రవేత్తల జాబితాలో 31 మంది అధ్యాపకులు చోటు దక్కించుకోవడం వంటి విజయాలను ప్రస్తావించారు. క్యాంపస్ నుంచి దాదాపు 300 స్టార్టప్‌లు ఆవిర్భవించడం సంస్థ ఆవిష్కరణ సామర్థ్యానికి నిదర్శనమని తెలిపారు.

### ముఖ్యాంశాలు

రికార్డు స్థాయిలో 1,398 మంది విద్యార్థులకు డిగ్రీలు
5 గోల్డ్ మెడల్స్, 44 సిల్వర్ మెడల్స్ ప్రదానం
IC Design & Technology తొలి బీటెక్ బ్యాచ్ పట్టభద్రత
IITH--Deakin సంయుక్త డాక్టరల్ తొలి బ్యాచ్‌కు డిగ్రీలు
"నవోన్మేషేణ దేశ నిర్మాణమ్" అధికారిక సంస్కృత నినాదం ఆవిష్కరణక్రిటికల్ మినరల్స్, డిఫెన్స్ టెక్నాలజీ, ×ూ× తదితర రంగాల్లో కొత్త కోర్సుల ప్రారంభంభారతీయ జ్ఞాన సంపదతో శాస్త్రాన్ని మేళవించాలని పట్టభద్రులకు పద్మ సుబ్రహ్మణ్యం పిలుపు

# గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి--కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భేటీ.. రాష్ట్ర రాజకీయాలపై కీలక చర్చ.

**హైదరాబాద్, జూలై 18, మన మహతి న్యూస్**



చాలా సంవత్సరాల తర్వాత మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గాంధీ భవన్‌కు వచ్చి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితోసమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలు, పార్టీ బలోపేతం, రానున్న ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.సమావేశం అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ లక్ష్యం రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడటమేనని అన్నారు. అందుకోసం తెలంగాణలో అత్యధిక లోక్‌సభ స్థానాలను గెలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ కోసం టీమ్‌గా పనిచేస్తే కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరుతుందని అన్నారు.

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, తాను పదవుల కోసం ఎదురుచూడడం లేదని, పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే తనకు తుది నిర్ణయమని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నిర్ణయాన్ని గౌరవిస్తానని తెలిపారు. తుంగతుర్తి అంశంపై స్పందించిన ఇద్దరు నేతలు, ఈ సమావేశంలో అది ప్రధాన ఎజెండా కాదని చెప్పారు. తుంగతుర్తి స్థానిక సమస్యలను అక్కడి కాంగ్రెస్ నాయకులే పరిష్కరించుకోవాలని రాజగోపాల్ రెడ్డి సూచించారని తెలిపారు. ఆ వివాదం ముగిసిన అంశమేనని కూడా పేర్కొన్నారు.జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఏఐసీసీ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రాజగోపాల్ రెడ్డి కీలక నాయకుడని, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో ఆయనకు బలమైన అనుబంధం ఉందని కొనియాడారు.తెలంగాణ ఉద్యమంలో రాజగోపాల్ రెడ్డి చేసిన పోరాటాన్ని గుర్తు చేసిన జగ్గారెడ్డి, రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఆయన అండగా నిలిచారని పేర్కొన్నారు. సమావేశంలో ప్రధానంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు.

## పీఎం శ్రీ పథకాన్ని అంగన్వాడి కేంద్రాల్లోనే అమలు చేయాలి.

**తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి జిలకర పద్మ పిలుపు.**



**మన మహతి న్యూస్ కొత్తగూడెం**

శనివారం జరిగిన అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జనరల్ బాడీ మీటింగ్ లో యూనియన్ జిల్లా కార్యదర్శి జిలకర పద్మ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా పేద కుటుంబాలకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తూ మానవ జీవన విధానానికి దారి చూపిస్తున్న అంగన్వాడి సెంటర్లను నిర్వీర్యం చేసి ఇతర ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీని విలీనం చేయాలని ప్రయత్నం చేస్తున్న చర్యలను తిప్పి కొట్టాలని ప్రీ ప్రైమరీ విద్యను కూడా అంగన్వాడి కేంద్రాలలోనే అమలు చేయాలని పద్మ డిమాండ్ చేశారు. ఇప్పటికే గర్భవతులకు పేర్లను నమోదు చేసి వారికి పోషకారాన్ని అందించి ఆరోగ్యాన్ని చెక్క దిద్దుతున్నామని అన్నారు. పిల్లల బరువును కూడా పెంచే విధంగా నాణ్యత కలిగిన పోషకాహారాన్ని సమయానికి అందిస్తున్నమన్నారు. ఒకవైపు ప్రజల ఆరోగ్య స్థితిగతులు, పిల్లలను సక్రమంగా పెంచే విధంగా,ఆటలు, పాటలతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన అవకాశాలు కల్పిస్తున్న అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ కు నష్టాలు కలిగించే పద్ధతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని పద్మ డిమాండ్ చేశారు. అంగన్వాడి ప్రాజెక్టుల రక్షణ కోసం అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో పోరాటాలు నిర్మిస్తామని తెలిపారు. బి ఎల్ ఓ డ్యూటీలు చేయకపోతే జీతాలు చేయమని మానసిక ఇబ్బందులు పెట్టి బలవంతంగా ప్రభుత్వ పథకాలు అన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని ఒత్తిడి చేస్తున్న పద్ధతులు మానుకోవాలని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కన్వీనర్ భూక్య రమేష్ యూనియన్ పట్టణ కార్యదర్శి కళావతి, నాయకురాళ్లు రత్నకుమారి, శైలజ, రాజకుమారి, అరుణ, జుబేదా, భవాని, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1 మహాధర్నాను విజయవంతం చేయాలి: డి. జిల్లా అధ్యక్షులు సురేష్



**మన మహతి న్యూస్ కొత్తగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సోషల్, బయాలజీ, తెలుగు ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణ సందర్భంగా తెలంగాణ ప్రోగ్రెసివ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు డి. సురేష్ మాట్లాడారు. టెట్‌కు సంబంధించి రాష్ట్రపతి ఆర్డినెన్స్ తీసుకురావడం, సీపీఎస్ రద్దు అంశాలపై కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలిసి చర్చించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలాగే పీఆర్సీ, పెండింగ్ డీఏలు, 317 జీవోతో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ, జీవన్ కుమార్, బి. కృష్ణ, శాంతి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి ప్రేమికుడు బాలు నాయక్ ను అభినందించిన కానిస్టేబుల్ శంకర్.

**మన మహతి న్యూస్ కొత్తగూడెం**



కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు, ప్రకృతి ప్రేమికుడు బాలు నాయక్ కానిస్టేబుళ్లు భూక్యా శంకర్, రాంబాబులకు నూరువరహాల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. నూరువరహాల వంటి ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంచడం ద్వారా పచ్చదనంతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని తెలిపారు.కానిస్టేబుల్ భూక్యా శంకర్ మాట్లాడుతూ, ప్రతి రోజూ మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు బాలు నాయక్ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.

## మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ ఆఫ్ తెలంగాణ యూనివర్సిటీలో 1507వ మొక్క నాటిన వనజీవి విశ్వామిత్ర చౌహాన్



**మన మహతి న్యూస్ కొత్తగూడెం**

పర్యావరణ పరిరక్షణ కొరకు తన వంతు బాధ్యతగా కృషి చేస్తూ వాక్ ఫర్ ట్రీస్ యజ్ఞంతో ముందుకు సాగుతున్న విశ్వామిత్ర చౌహాన్ ప్రతిరోజు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఈరోజు మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ ప్రాంగణంలో ఓఎస్డి టూ వైస్ ఛాన్సర్ డాక్టర్ జగన్మోహన్ రాజుతో కలిసి 1507వ మొక్కగా ఎర్రచందనం మొక్కను నాటాడు చిన్న వయసులోనే ప్రకృతి పట్ల అపారమైన ప్రేమను చూపిస్తూ నిర్విరామంగా సేవ చేస్తున్న విశ్వామిత్ర చౌహాన్ ను వైస్ ఛాన్సర్ అభినందించారు ఈ సందర్భంగా ఓఎస్డి టూ వైస్ ఛాన్సర్ మాట్లాడుతూ విశ్వామిత్ర చౌహాన్ పచ్చదనం కోసం చేస్తున్న కృషి గురించి తాను విన్నానని ఈరోజు ప్రత్యక్షంగా ఆయనతో కలిసి మొక్క నాటడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. దేశమంతా కలిసి విశ్వామిత్ర చౌహాన్ లా ఒకరోజు ఒక మొక్క నాటితే 147 కోట్ల మొక్కలు ఒకేరోజు నాటవచ్చని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలని విశ్వామిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు ప్రకృతిని కాపాడటమే నిజమైన దేశసేవ అని యువత అందరూ విశ్వామిత్ర బాటలో నడవాలని అన్నారు ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

## తల్లిదండ్రుల సమావేశంలో హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుపై అవగాహన కల్పించిన సీనియర్ ఉపాధ్యాయుడు పి.యస్.వి. ప్రసాద్ బాబు



**మన మహతి న్యూస్ భద్రాచలం**

ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భద్రాచలంలో శనివారం ప్రధానోపాధ్యాయులు జి. జాన్సన్ అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయులు--తల్లిదండ్రుల సమావేశం విజయవంతంగా జరిగింది. విద్యార్థుల విద్యా ప్రగతి, సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు జి. జాన్సన్ మాట్లాడుతూ పాఠశాల సాధిస్తున్న విద్యా ప్రగతి, ప్రభుత్వ విద్యలో అమలవుతున్న నూతన విధానాలు, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు, పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులు, విద్యా నాణ్యత పెంపునకు ఉపాధ్యాయులు చేపడుతున్న చర్యల గురించి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల సహకారం అత్యంత అవసరమని, పిల్లల చదువు, క్రమశిక్షణ, హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పాఠశాలతో నిరంతరం అనుసంధానంగా ఉండాలని కోరారు.

ఈ సందర్భంగా పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు పి.యస్.వి. ప్రసాద్ బాబు నూతన విద్యావిధానంలో కీలకమైన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు గురించి తల్లిదండ్రులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. విద్యార్థుల మార్కులకే పరిమితం కాకుండా వారి అభ్యాస నైపుణ్యాలు, ప్రవర్తన, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, విలువలు, క్రీడలు, కళలు, సహపాఠ్య కార్యక్రమాల్లో వారి ప్రతిభను సమగ్రంగా అంచనా వేయడమే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న ప్రసాద్ బాబు, పాఠశాల--తల్లిదండ్రుల సమన్వయంతోనే పిల్లలు అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించగలరని వివరించారు. తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలకు ఆయన ఓర్పుగా సమాధానాలు ఇచ్చి, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు అమలుపై పూర్తి అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో వివిధ వసతి గృహాల సంక్షేమ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# "సూపర్ ఎల్ నినో" ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం

## ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో రంగం సిద్ధం
## మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

వాతావరణ మార్పుల కారణంగా నిపుణులు హెచ్చరిస్తున్న "సూపర్ ఎల్ నినో" పరిస్థితులు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో వర్షపాతం, జలవనరులపై ప్రభావం చూపే అవకాశముందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.
అలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.
హైదరాబాద్‌లోని హోటల్ అవాసాలో "సింపోజియం" సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వాతావరణ మార్పులు (జశ్రీఅమేఖ్వ జష్ఘుఅస్త్రవ) అంశంపై సదస్సులో ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ, తెలంగాణలో వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తోందన్నారు.
గతంలో నమోదైన వర్షపాతం నమూనాల ఆధారంగా ఇకపై జలవనరుల ప్రణాళికలు రూపొందించడం సాధ్యం కాదని, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి నిర్వహణలో కొత్త వ్యూహాలను అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండున్నర సంవత్సరాల పాటు రాష్ట్రానికి అనుకూలమైన వర్షపాతం నమోదై రిజర్వాయర్లు సమృద్ధిగా నిండాయని, సాగు, తాగునీటి అవసరాలు సాఫీగా నెరవేరాయని తెలిపారు.
అయితే ప్రస్తుత వర్షాకాలంలో వర్షాభావ పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని, రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేవని పేర్కొన్నారు.
నిపుణులు సూచిస్తున్న "సూపర్ ఎల్ నినో" పరిస్థితులను ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణిస్తోందని మంత్రి తెలిపారు.
వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.
ముందస్తు నీటి నిర్వహణపై దృష్టి
వర్షాభావం తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే పరిస్థితులను అంచనా వేసి చర్యలు తీసుకునే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని మంత్రి తెలిపారు.
నీటిపారుదల, వ్యవసాయం, తాగునీరు, పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తున్నాయని చెప్పారు.
రిజర్వాయర్ల నిర్వహణలో రియల్‌టైమ్ డేటా వినియోగం, శాస్త్రీయ నిర్ణయాలు, శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు ప్రణాళికలను అమలు చేస్తున్నామని వెల్లడించారు.
పాలనకు ఇదే అసలైన పరీక్ష
వాతావరణ మార్పుల వల్ల ఏర్పడుతున్న అనిశ్చిత పరిస్థితుల నుంచి రైతులను రక్షించగలగడమే ప్రభుత్వాల అసలైన పరీక్ష అని మంత్రి పేర్కొన్నారు.
వాతావరణ మార్పులు జలవనరులపై ప్రభావం చూపుతాయా లేదా అన్నది ప్రశ్న కాదని, ఆ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థలు ఎంత వేగంగా మారుతున్నాయన్నదే అసలు సవాలని వ్యాఖ్యానించారు.
తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు నీరే పునాది
నీటిని కేవలం పంపిణీ చేసే వనరుగా కాకుండా, ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, రాష్ట్ర అభివృద్ధికి పునాదిగా చూడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.
నీటి నిర్వహణలో లోపాలు ఏర్పడితే వ్యవసాయం, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, పెట్టుబడులు, దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.
హైదరాబాద్‌కు దీర్ఘకాలిక తాగునీటి భద్రత
హైదరాబాద్ నగరానికి గోదావరి, కృష్ణా నదుల నుంచి తాగునీటిని అందించే దీర్ఘకాలిక ప్రణాళికలను గత ప్రభుత్వాలు అమలు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం వాటిని మరింత బలోపేతం చేస్తోందన్నారు.
అయితే భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఒకప్పుడు 50 నుంచి 100 అడుగుల లోతులో లభించిన భూగర్భ జలం, ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో వెయ్యి అడుగుల లోతుకు చేరుకుందని చెప్పారు.
వర్షపు నీటిని భూగర్భంలోకి చేరేలా భారీ స్థాయిలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు.
పట్టణాల్లో పెరుగుతున్న కాంక్రీటీకరణ వల్ల భూగర్భ జలాల పునరుద్ధరణ తగ్గిపోవడంతో వర్షపు నీటి సంరక్షణ అత్యవసరమైందన్నారు.
హైదరాబాద్‌లో చెరువులు, నీటి వనరులు, సహజ కాలువలను పరిరక్షించేందుకు ప్రత్యేకంగా హైడ్రా (న్ణ=ూ) వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.
గతంలో జరిగిన ఆక్రమణల వల్ల నగరంలో వరద ముప్పు పెరిగిందని, ప్రస్తుతం చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, సహజ డ్రైనేజీ వ్యవస్థల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# విద్యుత్ పంపిణీ వ్యవస్థను అత్యాధునిక సాంకేతికతతో మరింత బలోపేతం చేయాలి -- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క






హైదరాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో టీజీఎస్పీడీసీఎల్ పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీడర్--డీటీఆర్--వినియోగదారుల మ్యాపింగ్‌ను నిర్ణీత గడువులో పూర్తి చేసి ఎనర్జీ ఆడిట్‌ను పటిష్ఠంగా అమలు చేయాలని, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మిడ్జిల్ మోడల్ సబ్‌స్టేషన్ తరహాలో అన్ని సబ్‌స్టేషన్లను ఆధునీకరించాలని, అవసరమైన చోట ఫ్లైఓవర్ల కింద సబ్‌స్టేషన్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పవర్ అంబులెన్స్ సేవలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును అభినందిస్తూ విద్యుత్ భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ సంస్థలో అమలు చేస్తున్న ూ×, ఎనర్జీ ఆడిట్, ాజూణూ, ఖీమీ, ూవీ=, కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి ఆధునిక సాంకేతిక కార్యక్రమాలను వివరించారు. 2025--26లో విద్యుత్ బ్రేక్‌డౌన్లు, అంతరాయాల వ్యవధి గణనీయంగా తగ్గినట్లు తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, చక్రపాణి, కృష్ణ రెడ్డి, సింగరేణి, జెన్కో, డిస్కంల ఉన్నతాధికారులు, టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# మంత్రివర్యులు వాకిటి శ్రీహరి త్వరగా కోలుకోవాలని మాగనూరు. లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో. ప్రత్యేక. పూజలు......



మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ మండలం.

మన ప్రియతమ నాయకులు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి జ్వరంతో బాధపడుతున్న సందర్భంలో ఆయన జ్వరం నుండి త్వరగా కోలుకోవాలని ఆయన ఆరోగ్యంగా ఉండాలని మాగనూరు మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మాగనూరులోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో.ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది
ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు సర్పంచులు ఉపసర్పంచులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ముడుమాలలో విద్యార్థుల తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం






మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.


కృష్ణా మండలం ముడు మాల్ గ్రామం. తెలంగాణ విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ప్రతి నెలా మూడవ శనివారం జరిగే విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఉదయం 8.30నిమిషాల నుండి జరిగింది..
ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపాధ్యాయులు దండు శేఖర్ తల్లిదండ్రులతో ఈ సంవత్సరం పాఠశాలలో చేరిన విద్యార్థుల సంఖ్య మరియు పూర్వ ప్రాథమిక తరగతుల గురించి వివరించారు,ప్రస్తుతం పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నందున పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళుటకు నిర్ణయించడం జరిగింది.అధేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల పఠన సామర్థ్యాలు మరియు హోం వర్క్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భారతి,రవికుమార్,పద్మావతమ్మ,చైర్మన్ సాదు జయమ్మ హన్మన్న తల్లిదండ్రులు
నరేష్,మారెప్ప,మైనుద్దీన్,వెంకటప్ప,అశోక్,రంగప్ప,రఫీ,మారెప్ప,తాయప్ప,అంజప్ప,రామప్ప,అంజప్ప,శంక్రప్ప,బుదేప్ప మరియు
సోఫీ,శివమ్మ,మహిత,రేణుక,శ్రీదేవి,పద్మమ్మ,నర్సమ్మ,సురేఖ,హాఫీజా తదితరులు పాల్గొన్నారు..

# జక్లేర్-పెద్ద జట్రం రహదారి పనులు ప్రారంభించినందుకు కృతజ్ఞతలు....

## సామాజిక వేత్త బిజ్వార్ మహేష్ గౌడ్..

లమన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.






మక్తల్ మండల పరిధిలోని జక్లేర్ అంతరాష్ట్ర రహదారి నుంచి ఉట్కూరు మండలం పెద్ద జట్రం గేట్ వరకు గల 18 కిలోమీటర్ల రెండు వరుసల రహదారి నిర్మాణ పనులు చేపట్టినందుకు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సామాజిక వేత్త బిజ్వార్ మహేష్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.స్థానిక ఎంపీ డీకే అరుణ ద్వారా సి ఆర్ ఐ ఎఫ్ నిధుల క్రింద 36 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఇటీవల టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు ఎంపీ.డీకే అరుణ,మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి,అధికారులు ప్రత్యేకచొరవ తీసుకొని పనులు ప్రారంభించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యత ప్రమాణాలను పాటించి రెండు వరుసల రహదారి విస్తరణ పనులను పూర్తిచేయాలని మహేష్ గౌడ్. విజ్ఞప్తి చేశారు.

# పోరిక బలరాం తులసి రామ్ రాజు నాయక్ కమల గారి అమ్మగారు పోరిక వాలీబాయి కి ఘన నివాళులు అర్పించిన బంజారా నాయకులు మధు, రాజు నాయక్

ములుగు జిల్లా జులై 18 న్యూస్






ములుగు జిల్లా వెంకటాపూర్ మండల్ మల్లయ్య పల్లె విలేజ్ అడవి రంగాపురం లో ఈరోజు పోరిక సరోజన బలరాం నాయక్, అరుణ తులసి రామ్ నాయక్ , వనిత టీచర్ రాజు నాయక్, కమల తల్లిగారు అకస్మాత్తుగా మరణించడం జరిగింది అంతక్రియలలో భారీ ఎత్తున ప్రజలు హాజరై పూలమాలతో చిత్రపటానికి పాలాభిషేకం చేసి నివాళులు అర్పించిన బంధుమిత్రులు అల్లుడు కేతావత్ కమల మధు, లావుడియా పల్లవి రాజు నాయక్, జీవన శ్రీ, సేహ్వాగ్, సంతోష్ కుమార్, రాజస్థాన్ నుండి కేతావత్ మాధవి సందీప్ కుమార్, డాక్టర్ శ్రీరామ్, నీల అశోక్,విజయ్, వినోద్,గ్రామ సర్పంచ్ గణేష్, గ్రామ పెద్ద మనుషులు రాజు నాయక్, జగ్రామ్ నాయక్, సమ్మె నాయక్, రఘు, శ్రీను, సర్దార్ సింగ్, సీతారాం, రతన్ సింగ్, రాము, సురేష్, ఓం సింగ్, రతన్ సింగ్, శివ, శేఖర్, సమ్మయ్య, జుమీలాల్, శంకర్, రాజు, కిషన్ నాయక్, సత్తయ్య, సామ్య నాయక్, కిషన్, జవహర్లాల్, ముఖ్య నాయకులు పాల్గొని ఆటపాటలతో అంతక్రియలో పాల్గొని నివాళులు అర్పించిన బంధుమిత్రులు

# 108 అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవం..తల్లి బిడ్డ క్షేమం

## ఆపద సమయంలో ఆపద్బాంధవులుగా నిలుస్తున్న 108అంబులెన్సు సేవలు
## 108 అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన-బంధువులు

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.

ప్రజలు అత్యవసర 108 అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలి– సునీల్ కుమార్ (డిస్టిక్ మేనేజర్)



నారాయణపేట జిల్లా (మద్దూర్ మండలం):108 అంబులెన్స్‌లో ఓ మహిళ శిశువుకు జన్మించిన ఘటన శనివారం మద్దూరుమండల కేంద్రంలో చోటుచేసుకుంది. రేణువట్ల గ్రామానికి చెందిన " కవిత మూడో కాన్పు నిమిత్తం 'పురిటి నొప్పులతో బాధపడుతుండగా.. కుటుంబసభ్యులు.. దగ్గర్లో ఉన్న మద్దూరు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలించారు, అక్కడ వైద్యులు పరీక్షించిన తర్వాత గర్భిణి స్త్రీకి ఉమ్మనీరు పోవడంతో, మెరుగైన వైద్యం కోసం దగ్గరలో ఉన్న నారాయణపేట జిల్లా ఆస్పత్రి 108 లో రిఫరల్ చేసినారు. దీంతో తక్షణమే కోస్గి 108 అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకొని, గర్భిణీ స్త్రీని నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో, క్యాతను పల్లి గ్రామ మార్గమధ్యలో టెక్నీషియన్ వెంకటేష్ "ఈ ఆర్ సి పి "డాక్టర్ శివ సూచనలతో అంబులెన్స్ లోనే ప్రసవం చేసినారు, గర్భిణీ స్త్రీ కి ఆడ శిశువుకు జన్మనిచ్చింది.అనంతరం నవజాత శిశువుకు తగు పరిచర్యలు చేస్తూ , ఆక్సిజన్ అందిస్తూ తర్వాత వారిని దగ్గర్లో ఉన్న నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించామని 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. అక్కడ వైద్యులు పరిశీలించిన తర్వాత తల్లి బిడ్డ క్షేమమని తెలిపారు అత్యవసర సమయంలో ఆపద్బాంధవులు చాకచాక్యంగా, సమయస్ఫూర్తితో వ్యవహరించి..తల్లిబిడ్డల ప్రాణాలను కాపాడిన108 అంబులెన్స్ సిబ్బంది, పైలెట్ : శంషుద్దీన్ టెక్నీషియన్ : వెంకటేష్ లను బాధిత కుటుంబసభ్యులు, ఆస్పత్రి వైద్యులు అభినందించారు

# అధిక ధరల ఏరువులపై చర్యలు తీసుకోవాలి.

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం



అధ్యక్షులు వెంకటరాముల ముదిరాజ్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో డిఏపి ధరలు ఆకాశాన్ని అంటుకుంది ఎమ్మార్పీ 1350 ఉంటే రూపాయలు 19 వందలు నుండి 2500 వరకు విక్రయిస్తున్నారు దీనిపై జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు రైతులు వర్షాలు రాక ఎన్నో ఇబ్బందులకు గురై విత్తనాలు వేసిన వర్షాలు రాకపోవడంతో అప్పుల పాలై మదన పడుతున్నారు దాంతోపాటు అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసి పంటలు వేయడంతో రైతులు నష్టపోయి అప్పుల పాలు అవుతున్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి అదేవిధంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని ప్రభుత్వము అమలు చేయాలి వెంటనే కలెక్టర్ స్పందించి ఎరువుల అధిక ధరలను నియంత్రించ కుంటే నారాయణపేట జిల్లా కిషన్ మోర్చా తరఫున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరిస్తున్న స్పందించి ఫర్టిలైజర్ షాప్ పై నియంత్రించాలని కోరుతున్నాను ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి బలరాం రెడ్డి మక్తల్ మండల అధ్యక్షుడు ఎం ప్రతాపరెడ్డి మాధ్వార్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ శంకర్ మహదేవమ్మ కానాపురం సురేష్ పాల్గొన్నారు



# భారత్ సరికొత్త అడుగు.. 'విక్రమ్-1' విజయంపై పవన్ పోస్ట్..

ముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్  పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1 (' ప్రయోగం విజయవంతమైంది. దీనిపై ఏపీ పముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. టీమ్‌ను అభినందిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. శ్రీహరికోట నుంచి జరిగిన ఈ చరిత్రాత్మక ప్రయోగం దేశ అంతరిక్ష రంగంలో ఒక మైలురాయి అని పేర్కొన్నారు."ఈ రోజు భారతదేశం సరికొత్త చరిత్ర సృష్టించింది. తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం మన దేశానికే గర్వకారణం. సాంకేతికతకు, సృజనాత్మకతకు మోదీ ప్రాధాన్యమిస్తారని ఈ ప్రతిష్ఠాత్మక మిషన్‌తో మరోసారి నిరూపితమైంది. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఈ ప్రయోగంతో భారతీయులందరికీ ఒక శక్తిమంతమైన సందేశాన్ని పంపారు. ఈ విజయం రాబోయే తరాలు పెద్ద కలలు కనడానికి,  భారతదేశాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి స్ఫూర్తినివ్వాలని కోరుకుంటున్నా" అని అన్నారు.

# ఆమె విజయానికి నిబద్ధతే కారణం.. రష్మికపై బృందా మాస్టర్ ప్రశంసలు






అగ్ర నటి రష్మిక పై డ్యాన్స్ కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ ప్రశంసలు కురిపించారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'మైసా'. ఇందులో బృందా ఒక సాంగ్ కోసం పని చేశారు. ఆ పాట షూటింగ్ సమయంలో రష్మిక కష్టాన్ని కొనియాడుతూ ఆమె ఇన్‌స్టాలో ఇటీవల ఒక పోస్ట్ పెట్టారు. " 'మైసా'లో ఒక సాంగ్‌కు పని చేయడం సంతోషంగా ఉంది. ఆ పాట కోసం రష్మిక చేసిన సాధన నిజంగా అద్భుతం. చిత్రపరిశ్రమలో ఇంత శ్రమపడే, క్రమశిక్షణ, పట్టుదల ఉన్న హీరోయిన్‌ని చూడడం ఇదే తొలిసారి. నేను ఏ కరెక్షన్ ఇచ్చినా, రష్మిక నవ్వుతూ సరిదిద్దుకుంటారు. షూటింగ్‌లో ఎప్పుడూ ఏకాగ్రతతో ఉంటారు. ఆమె సాధిస్తున్న విజయాలకు తన నిబద్ధతే కారణం. ఆ కష్టాన్ని ప్రేక్షకులు తప్పకుండా గుర్తిస్తారు. మైసాలో రష్మిక సృష్టించిన మ్యాజిక్‌ను ప్రపంచం చూడడం కోసం నేను ఎదురుచూస్తున్నాను " అని బృందా రాసుకొచ్చారు. నేడే జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన ఈ సినిమా కథ ఆదివాసీ ప్రాంతాల నేపథ్యంలో సాగుతుంది. ఈ సినిమా కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. ఇటీవల అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. ఈ మూవీలో తారక్ పొన్నప్ప కీలక పాత్రలో పోషిస్తున్నారు. ఇక రష్మిక తదుపరి ఆమె భర్త విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి'లో కనిపించనున్నారు.



# తెలుగులో ఉన్న ఐక్యత అక్కడ లేదు

వృత్తిపరంగా తన ఎదుగుదల తెలుగు చిత్రసీమలోనే జరిగిందని అంటోంది అందాల తార రకుల్ ప్రీత్ సింగ్. బాలీవుడ్ కంటే తెలుగు చిత్రపరిశ్రమలో ఐక్యత, పరస్పర సహకారం ఎక్కువగా ఉంటాయని చెప్తోంది. పలు హిట్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైందీ భామ. ప్రస్తుతం హిందీ చిత్రాలతో బిజీగా గడుపుతోన్న రకుల్.. టాలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమల మధ్య తేడాల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "టాలీవుడ్‌లో ఒకరి సినిమాల్ని మరొకరు ప్రచారం చేస్తూ.. బహిరంగంగా మద్దతు ఇస్తుంటారు. అక్కడ బలమైన పోటీ ఉన్నప్పటికీ ఎలాంటి సంకోచం లేకుండా ఇతర నటీనటుల విజయాలను మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తారు. కానీ బాలీవుడ్‌లో పరిస్థితులు ఇలా లేవు. ఇక్కడ సినీతారల మధ్య ఉన్న అభద్రతా భావం ఒకరికొకరు మద్దతు ఇచ్చుకోకుండా అడ్డుకుంటుంది. ముంబయిలో ప్రతికూల ప్రచారం సర్వసాధారణమైపోయింది. దానిని తొలగిస్తే బాలీవుడ్ తిరిగి గాడిలో పడుతుంది. అందరూ ఏకతాటిపై నిలిస్తేనే అది మరింత బలమైన పరిశ్రమగా మారుతుంద"ని అంది రకుల్.


# తెలుగు చిత్రాలకు జాతీయ అవార్డుల పంట.. ఈ నాలుగు చిత్రాలకు 8 పురస్కారాలు




న్యూదిల్లీ: 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదు వంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ నిహారిక కొణిదెల  నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది.ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్' . ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా (సంభాషణలు) జాతీయ అవార్డు దక్కింది.మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2' . ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత (ఒరిజినల్) కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనుసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.

# 'వారణాసి' సర్‌ప్రైజ్.. ప్రియాంక లుక్ రిలీజ్





మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'. ఇందులో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు.ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు.




# వాస్తవ సంఘటనలతో 'ది ఇండియా స్టోరీ'.. ట్రైలర్ చూశారా?

కథానాయిక కాజల్ కీలక పాత్రలో చెట్టన్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'ది ఇండియా స్టోరీ'  శ్రేయాస్ తల్పాడే త్రిష శారద, మురళీశర్మ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 24న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ విడుదలైంది. మన వంటింట్లో వాడే నిత్యావసర సరుకుల నుంచి పిల్లలు తాగే పాల వరకూ ప్రతిదీ కల్తీనే. ఇప్పుడిదే అంశాన్ని 'ది ఇండియా స్టోరీ' ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పురుగు మందులను వినియోగించడం వల్ల ఎలాంటి నష్టాలు జరుగుతున్నాయి? కల్తీ ఆహార సమస్య ఎంత మంది ప్రాణాలను బలితీసుకుంటుందనే అంశాల ఆధారంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. కాజల్ ఇందులో న్యాయవాదిగా కనిపించనున్నారు.

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural  Telanagana 507003 ,  Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural  Telanagana 507003,  EDITOR : Boda prakash   PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372.  EMAIL: manamahati@gmail.com